# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 29 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఆర్టీఏ చెక్ పోస్టులు ఎత్తివేత

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం రవాణా రంగంలో పారదర్శకతను పెంచడం, అవాంతరాలు లేని సేవలను అందించడం లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా రవాణా శాఖకు చెందిన అన్ని చెక్‌పోస్టులను తక్షణమే రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యతో రాష్ట్రంలో చెక్‌పోస్టుల వద్ద జరిగే జాప్యం, అవినీతి వంటి సమస్యలకు ముగింపు పలకనుంది. కొత్తగా జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం వాహన తనిఖీల కోసం ఇకపై మొబైల్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ మొబైల్ స్క్వాడ్‌లు వాహనాలను ఆరు నెలలకు ఒకసారి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈఓ) అనుమతితో తనిఖీ చేస్తాయి.

చెక్‌పోస్టులు రద్దు: రాష్ట్రంలోని అన్ని రవాణా చెక్‌పోస్టులు శాశ్వతంగా రద్దు చేసింది.

మొబైల్ స్క్వాడ్‌లు: రవాణా శాఖ అధికారులు మొబైల్ స్క్వాడ్‌ల ద్వారా తనిఖీలు నిర్వహిస్తారు. ఇది అక్రమ రవాణాను నివారించడంలో సహాయపడుతుంది.

ఆన్‌లైన్ ఫీజులు: రవాణా ఫీజులు, పన్నులు చెల్లించడానికి వాహనదారులకు ఆన్‌లైన్ సదుపాయం కల్పిస్తారు.

పారదర్శక వ్యవస్థ: వాహన తనిఖీలు, పన్నుల వసూలు కోసం మిగితా 2వ పేజీలో

# మునిగిన ఉమ్మడి నిజామాబాద్



- చెరువులను తలపించిన కాలనీలు
- పరిస్థితిపై మంత్రి సీతక్క సమీక్ష
- ఉమ్మడి మెదక్ జిల్లాలో వరదల్లో చిక్కుకుని ఇద్దరు మృతి
- తెగిన రోడ్లు, కాల్వలు.. స్తంభించిన రవాణా వ్యవస్థ
- నీట మునిగిన పంట పొలాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను వరద ముంచెత్తింది. బుధవారం ఉదయం ప్రారంభమైన వర్షం గురువారం సాయంత్రం వరకు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. పంటలు నీటమునిగాయి. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు భారీ వరద ప్రవాహం రావడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. కుంభవృష్టి వర్షం కామారెడ్డిని అతలాకుతలం చేసింది. రాజంపేట్‌లో వరద ప్రవాహానికి ఇంటిగోడ కూలి డాక్టర్ మృతిచెందారు. కామారెడ్డిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్‌షెట్కార్ పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. అనంతరం సమీక్షించి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అధికారులు, పోలీసులు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా ప్రశంసించారు.

కామారెడ్డి పట్టణంలో గతంలో ఎన్నడూ లేనంతగా భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. దేవి విహార్ కాలనీలో ఒక అంతస్తు వరకు ఇండ్లు నీట మునగడంతో స్థానికులు పై అంతస్తులకు వెళ్లి తలదాచుకున్నారు. సాయంత్రం వేళ రెస్క్యూ బృందాలు వచ్చి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. కామారెడ్డి–హైదరాబాద్ వెళ్లే 44వ జాతీయ రహదారి వరద తాకిడికి పలుచోట్ల కోతకు గురైంది. దీంతో హైవేపై దాదాపు 20 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వన్ వేలో వాహనాలను పంపిస్తూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కామారెడ్డి–భిక్కనూర్ మార్గంలో పట్టాల కింద గండిపడటంతో పలు రైళ్లను రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లించారు. కామారెడ్డిలో సీపీఐ(ఎం) కార్యకర్తలు వరద ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో వరద పొంగిపొర్లింది. పలు చోట్ల వాగులు, చెరువు కట్టలు తెగిపోయి వరద ముంచెత్తింది. వరద నీటిలో చిక్కుకున్న వారిని పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా రక్షించాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరంపల్లిలోని గిరిజన గురుకుల పాఠశాలలోకి నీరు చేరడంతో సుమారు 300 మంది విద్యార్థులను సురక్షితంగా తరలించారు. మనిషి లోతు వరద నీరు చుట్టుముట్టడంతో తాడు ఏర్పాటు చేసి కామారెడ్డి పోలీసులు వారిని సురక్షితంగా తరలించారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన బట్టు గణేష్, సిరిగారి రాజు వాగులో ద్విచక్ర వాహనంతో కొట్టుకుపోగా.. బోరు మోటర్ పైపులు పట్టుకొని బయటపడ్డాడు. సంగమేశ్వర్‌లో వరదకు పశువుల షెడ్డు కొట్టుకుపోగా.. మూడు పశువులు మృత్యువాత పడ్డాయి.

రాష్ట్రంలో అత్యధికంగా వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ఉంది. మెదక్ జిల్లాలో మిగితా 2వ పేజీలో



# సీఎం రేవంత్ ఏరియల్ సర్వే

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలపై ఉదయం ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే ద్వారా ఆయా ప్రాంతాలను పరిశీలించారు. వరద ప్రాంతాల పరిశీలన అనంతరం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సహాయక చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు. వరద నష్టంపై నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు.నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి హెలికాప్టర్‌లో తొలుత ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుకుని అక్కడ వరద పరిస్థితిని పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోచారం ప్రాజెక్టు, పరీవాహక ప్రాంతంతో పాటు హెలికాప్టర్ ద్వారా కామారెడ్డి జిల్లాలోని వరద ప్రాంతాలను పరిశీలించారు. వరద తీవ్రత దృష్ట్యా ఆ జిల్లాలో జరిగిన నష్టం, తీసుకుంటున్న చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో ముఖ్యమంత్రి గారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కామారెడ్డిలో ల్యాండ్ కాలేకపోయింది.దాంతో అక్కడి నుంచి నేరుగా మెదక్ జిల్లాలో వరద ప్రాంతాలను పరిశీలించారు. మెదక్ చేరుకున్న ముఖ్యమంత్రి గారు జిల్లా ఎస్పీ కార్యాలయంలో లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు గారు, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రతను, తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు.

కామారెడ్డి జిల్లాలో వరదల కారణంగా దెబ్బతిన్న పలు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీతో పాటు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో పరిస్థితులను సమీక్షించారు.

## 1,071 మందిని కాపాడిన రెస్క్యూ బృందాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా సహాయక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న 1,071 మందిని రెస్క్యూ బృందాలు సురక్షితంగా కాపాడినట్టు ప్రభుత్వం పేర్కొంది. అలాగే, వరద ప్రభావిత ప్రాంతాల్లో 1,000 మందికి ఆహార పదార్థాలు అందజేసినట్టు తెలిపింది. ఈ సహాయక చర్యల్లో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్), స్థానిక పోలీసు బృందాలు పాల్గొన్నట్టు ప్రభుత్వం తెలిపింది. అలాగే కొన్నిచోట్ల వరదలో చిక్కుకున్న వారికి డ్రోన్ల సహాయంతో ఆహార పదార్థాలు అందజేసినట్టు ప్రభుత్వం వెల్లడించింది. కామారెడ్డి, మెదక్, ఖమ్మం వంటి తీవ్ర వరద ప్రభావిత జిల్లాల్లో ఈ రెస్క్యూ ఆపరేషన్లు జరిగాయని ప్రభుత్వం పేర్కొంది.

## భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు

- ఆందోళన వ్యక్తం చేసిన కేసీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్ నుండి ఖమ్మం వరకు పలు జిల్లాల్లో వరదల కారణంగా ఇళ్లు మునిగిపోవడం, రహదారులు తెగిపోవడం, రవాణా వ్యవస్థ దెబ్బతినడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలకు కెసిఆర్ ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. బాధిత ప్రాంతాల్లో ప్రజలతో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద పరిణామాల దృష్ట్యా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసి సహాయక చర్యలను వేగవంతం చేయాలని కెసిఆర్ సూచించారు.



## కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడం తగదు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ దుష్ప్రచారం చేయడం తగదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరంపై ప్రజలకు నిజం చెప్పేందుకు తమకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కు అవకాశమివ్వాలని సభాపతిని సమయం కోరగా ఇవ్వలేదనీ, అసెంబ్లీ కార్యదర్శి తీసుకోలేదని చెప్పారు. రాష్ట్రంలో కరువు పారద్రోలిన ప్రాజెక్టు కాళేశ్వరం అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందని చెప్పారు. రెండు పిల్లర్లు కుంగితే ఏదో జరిగినట్టు మాట్లాడటం తగదని హితవు పలికారు. జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను తప్పుపడుతున్నామనీ, ఈ మేరకు న్యాయపోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల కోసం అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశమివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద, సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్ పాల్గొన్నారు.

## ఏ పోటీలు నిర్వహించినా తెలంగాణకు అవకాశం కల్పించాలి

- తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం
- హైదరాబాద్ లో జరిగిన స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ పాలక మండలి తొలి సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగితా 2వ పేజీలో

# వచ్చే మూడు రోజులూ వానలే

- ఉత్తర తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన
- కామారెడ్డిలో అత్యధికంగా 17 సెంటీమీటర్ల వాన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు ఎక్కువ ప్రాంతాల్లో, భారీ వర్షాలు పలు ప్రాంతాల్లో పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎక్కువ ప్రాంతాల్లో వర్షం పడే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో విస్తారంగా వర్షం పడే సూచనలున్నాయి. అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులతో కూడిన వర్షం పడొచ్చు. రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలున్నాయి. గురువారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 500కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో పలుచోట్ల కుండపోత వర్షం పడింది. నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, మెదక్ జిల్లాల్లో 60కి పైగా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

## భారీగా నష్టపోయిన జిల్లాలకు అదనంగా నిధులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



వర్షాలతో భారీగా నష్ట పోయిన జిల్లాలకు అదనంగా నిధులిస్తామని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం విపత్తుల నిర్వహణా శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. మెదక్, కామారెడ్డి సిరిసిల్ల నిర్మల్ జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్ ద్వారా మాట్లాడారు. వరదల నేపథ్యంలో ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రూ.కోటి చొప్పున నిధులు విడుదల చేశామనీ, భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న జిల్లాలకు అదనంగా నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. మెదక్, కామారెడ్డి ఆదిలాబాద్ జిల్లాల్లో పెద్దఎత్తున వర్షపాతం నమోదైందన్నారు. అయినా ప్రాణ, ఆస్తినష్టం వీలైనంత మేరకు తగ్గించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వరదల్లో చిక్కుకున్నవారికి డ్రోన్ల ద్వారా ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలోని నర్మాల వద్ద బుధవారం మానేరు వాగు వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షించామని చెప్పారు.

భారీ వర్షాలతో స్తంభించిన జాతీయ రహదారితోపాటు, పంచాయితీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లను క్లియర్ చేశామని అన్నారు, రహదారి సౌకర్యాలు దెబ్బతిన్న మండల, జిల్లా కేంద్రాలకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. జిల్లాల్లో రెవెన్యూ. పోలీసు విభాగాలు చిత్తశుద్ధితో 24 గంటలు పనిచేస్తున్నాయని కొనియాడారు. వర్షాలు, వరదలపై ఆయా జిల్లాల యంత్రాంగంతో నిరంతరం మానిటరింగ్ చేసుకోవాలని విపత్తు నిర్వహణ అధికారులకు మంత్రి సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. ఈ విపత్తు వల్ల చనిపోయిన వారి కుటుంబాలను మిగితా 2వ పేజీలో

# ఎగువ మానేరు ఉగ్ర రూపం ...

- ఒక్కరు గల్లంతు..
- వరద నీటిలో చిక్కుకున్న వారు క్షేమం..
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ,ఎస్పీ మహేష్ బి.గితే

**బలంగం టీవి, రాజన్నసిరిసిల్ల**



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాలతో ఎగువ నుంచి ప్రవహించిన వరదతో ఎగువ మానేరు ఉగ్రరూపం దాల్చింది. బుధవారం ఉప్పొంగి ప్రవహించిన మానేరు నది పరవళ్లు తొక్కుతోంది. ఉగ్ర రూపం దాల్చిన మానేరు నది గురువారం కూడా అదే స్థాయిలో కనిపించింది. మరింత ఎక్కువగా రూపుదాల్చడంతో పరీవాహక ప్రాంతాల్లో ఆందోళన నెలకొన్నది. ప్రజలను ఒక్కసారిగా అతలాకుతలం చేసింది.బుధవారం ఎగువ మానేరు ప్రాజెక్టు అవతలి వైపు పశువులను మేపేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల క్యాంప్ కి చెందిన అరుగురు రైతులు వెళ్లారు. పంపుకాడి నాగయ్య(43) ఇవతలి వైపు వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా ఉద్ధతంగా నీటి ప్రవాహం పెరగడంతో అదుపు తప్పి వాగు లో గల్లం తయ్యాడు. మిగతా ఐదుగురు రైతులు జంగం స్వామి,పిట్ల నర్సింలు,ధ్యానబోయిన స్వామి,పిట్ల మహేశ్,పిట్ల స్వామి అక్కడే చిక్కుకుపోయారు. దీంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి.గితే హుటా హుటిన ప్రాజెక్ట్ వద్దకు చేరుకొని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. వారికి డ్రోన్ సహాయంతో ఆహార పదార్థాలను పంపిచారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ ,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ,సిరిసిల్ల ఎమ్మెల్యే కేటిఅర్ ఎప్పటికప్పుడు సాయక చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగితా 3వ పేజీలో

## శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద పరిస్థితులపై సీఎం సమీక్ష



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఏరియల్ మార్గం ద్వారా పెద్దపల్లి జిల్లా గోలివాడ పంప్‌హౌస్ వద్ద హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు. ప్రాజెక్టుకు వస్తున్న వరద ఇన్‌ఫ్లో, ప్రస్తుత నీటి నిల్వ, దిగువకు వదులుతున్న నీటిపై అధికారులు వివరాలు అందించారు.

ప్రాజెక్టు నిర్వహణ పకడ్బందిగా ఉండాలని, వరద ముగిసే సమయానికి పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వరద ప్రభావిత లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కూడా అధికారులను ఆదేశించారు. గోదావరి నీటిని తెలంగాణ ప్రజలకు ఉపయోగపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లంపల్లిని జంక్షన్‌లా నిర్మించిందని సీఎం గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల రిజర్వాయర్ల పునరుద్ధరణ, మరమ్మత్తు అవకాశాలను నిపుణుల సూచనలతో పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.ఈ పరిశీలనలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఎస్.ఈ. శ్రీనివాస్ గుప్తా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణు, ఆర్డీవో గంగయ్య, జిల్లా ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి చెందిన హెలికాప్టర్లు బీహార్‌లో ఏం చేస్తున్నాయి

- వర్షాలపై ముందస్తు ప్రణాళికలు లేకనే ఆస్తి ప్రాణస్టం..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టివి, రాజన్న సిరిసిల్ల**



రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకనే వర్షాల వల్ల ప్రాణ, ఆస్తి మరియు పంట నష్టం జరిగిందని, సీఎం రేవంత్ రెడ్డికి మూసి సుందరీకరణ, ఒలంపిక్స్ పై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, నర్మాల మానేరు వాగులో గల్లంతైన నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వాగులో చిక్కుకుపోయిన బాధితులను కేటీఆర్ పరామర్శించారు. అనంతరం గంభీరావుపేట మండలం, నాగంపేటకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త జలేందర్ ఇల్లు భారీ వర్షాలకు కూలిపోగా, కూలిన ఇంటిని పరిశీలించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ వర్షాలు, వరదలకు ప్రజలు అవస్థలు పడుతుంటే.. సీఎం రేవంత్ రెడ్డి మూసి, ఒలంపిక్ ఎట్ల తేవాలని రివ్యూలు నిర్వహిస్తున్నాడని అన్నారు. రాష్ట్రం వరదల్లో ఉంటే మూసీ సుందరీకరణ, ఒలింపిక్ తేవాలని చర్చ చేయడం ముఖ్యమా అని ప్రశ్నించారు.ప్రస్తుతం పంట, ఆస్తి, ప్రాణ నష్టం ఎంత జరిగింది, ఎంత మంది విపత్తుల్లో ఉన్నారు చూసి తీరిక సీఎం రేవంత్ రెడ్డికి లేదు అని అన్నారు. కేసీఆర్ హయాంలో మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో వరదలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు హెలికాప్టర్‌లను పంపి సామాన్యుల ప్రాణాలను కాపాడడం జరిగిందని అన్నారు. రాష్ట్రానికి చెందిన హెలికాప్టర్లు బీహార్ ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్నాయని, ఇంకా ఎక్కడెక్కడో తిరుగుతున్నయ్ తప్ప సామాన్యులకు అందుబాటులో లేవు అని అన్నారు. ఖమ్మంలో వరదలు వస్తే పట్టించున్న నాథుడు లేడని, ముగ్గురు మంత్రులున్నా ఖమ్మం జిల్లాకు హెలికాప్టర్‌ను పంపలేదని అన్నారు. నర్మాలలో చిక్కుకున్న ఐదుగురిని

## నర్మాల వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని కాపాడిన రెండు ఆర్మీ చాపర్లు

- బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు 4 ఆర్మీ హెలికాప్టర్లను పంపించిన రక్షణ శాఖ
- బాధితులను ఆదుకునేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేసిన కేంద్రమంత్రి
- వరదల్లో గలంతైన నాగం కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి

**బలగం టీవి,రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో వరదల్లో చిక్కుకుపోయిన 5 గురు వ్యక్తులను కాపాడేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం నుండి చేసిన క్రుషి ఫలించింది. ఆర్మీ హెలికాప్టర్లను ప్రత్యేకంగా రప్పించి బాధితులను ఎయిర్ లిఫ్ట్ చేసి కాపాడారు. దీంతో ప్రాణభయంతో వరదల్లో చిక్కుకుని బిక్కుబిక్కుమంటున్న బాధితులు క్షేమంగా బయటకు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు ఆర్మీ హెలికాప్టర్లు వస్తున్నాయనే సమాచారం అందుకున్న బండి సంజయ్ గురువారం మధ్యాహ్నం నర్మాలకు చేరుకోవడం, అప్పటికే ఆర్మీ హెలికాప్టర్లు బాధితులను బయటకు తీసుకురావడం చకచకా జరిగిపో యాయి. ఈ నేపథ్యంలో నర్మాలకు కేంద్ర మంత్రి చేరుకోగానే క్షేమంగా బయటపడ్డ బాధితులు బండి సంజయ్ వద్దకు వచ్చి తమ ప్రాణాలను కాపాడినందుకు ధన్యవాదాలు తెలిపారు. పొంగుతున్న పొర్లుతున్న వరద ప్రవాహాన్ని వీక్షించారు.. వరదల్లో గల్లంతైన నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్య నివాసానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ వెళ్లి, నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. మనోధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటామని వారిని ఓదార్చారు. నాగం కుమారుడు సాయికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ధైర్యంగా ఉండాలంటూ భరోసా ఇస్తూ ముందుకు కదిలారు. బుధవారం నుండి రెస్క్యూ ఆపరేషన్లలో నిమగ్నమైన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చేసిన కృషి మరువలేనిదన్నారు. నర్మాలలో రెస్క్యూ ఆపరేషన్ ను పర్యవేక్షిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ దామోదర సింగ్ ను అభినందిస్తూ కేంద్ర మంత్రి శాలువాతో సన్మానించారు.

మిగితా 3వ పేజీలో

# ఆర్టీఏ చెక్ పోస్టులు ఎత్తివేత

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలు, ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నారు.

జరిమానాలకు అవకాశం: నిబంధనల ఉల్లంఘన, రవాణా చట్టాలను ఉల్లంఘించిన వాహనాలపై జరిమానాలు ఆన్‌లైన్‌లో విధిస్తారు.

ఈ మార్పులన్నీ రాష్ట్ర రవాణా శాఖలో అవినీతిని తగ్గించి, పారదర్శకతను పెంచుతాయని ప్రభుత్వం తెలిపింది. ఈ ఉత్తర్వులన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది.

# భారీగా నష్టపోయిన జిల్లాలకు అదనంగా నిధులు

(మొదటి పేజీ తరువాయి)

అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు.

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కేవలం ఒక గంట వ్యవధిలో 700 మిల్లీమీటర్ల వర్షం కారణంగా నీటి వనరులు పూర్తిగా నిండిపోయాయనీ, వాటి నుంచి ఉధృతంగా నీరు బయటకు వెళ్లడంతో గట్లు దెబ్బతిని తీవ్ర నష్టాన్ని కలిగించిందని వివరించారు. తండాలు ఎక్కువగా వర్ష బీభత్సానికి గురయ్యాయనీ, వాటికి తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పించేలా అధికారులను ఆదేశించారు. వర్షాల తర్వాత వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయనీ, తగిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖకు సూచించారు.

# పీఎం స్వనిధి పథకం గడువు పొడిగింపు

బలగం టీవీ, హైదరాబాద్

పీఎం స్వనిధి పథకం గడువు 2030 మార్చి 31 వరకు పొడిగిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన మూడు గంటల పాటు జరిగిన కేంద్ర మంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి స్వనిధి పథకాన్ని 31 మార్చి 2030 వరకు పొడించారు. మొత్తం బడ్జెట్ రూ. 7,332 కోట్లని పేర్కొంది. ఈ పథకం కింద 1.15 కోట్లకు పైగా స్ట్రీట్ వెండర్లు (వీధి వ్యాపారులు) ప్రయోజనం పొందుతారు. ఇది చిన్న వ్యాపారులను ఆత్మనిర్భర్‌గా మార్చడానికి సహాయపడుతుంది. చిన్న వ్యాపారులకు రుణాలు, ఆర్థిక సహాయం కింద మొదటి రుణం రూ. 15,000, రెండో రుణం రూ. 25,000, మూడో రుణం రూ. 50,000 ఇస్తారు.పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తెలంగాణ–కర్నాటక ఉమ్మడి ప్రాజెక్ట్‌లో భాగంగా తెలంగాణలోని సికింద్రాబాద్ (సనత్ నగర్) – కర్నాటకలోని వాడి మధ్య మూడో, నాలుగో రైల్వే లైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం రూ. 5,012 కోట్లతో 173 కిలో మీటర్ల కొత్త లైన్‌కు ఆమోదం తెలిపింది. సనత్ నగర్–వాడి ప్రాజెక్ట్ తెలంగాణ–కర్నాటక రాష్ట్రాల పరిధిలోని సుమారు 3,108 గ్రామాల్లో దాదాపు 47.34 లక్షల జనాభాకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపింది. రాబోయే ఐదేండ్లలో ఈ ప్రాజెక్ట్ ను పూర్తి చేయనున్నట్టు కేంద్రం వెల్లడించింది.

దీంతో పాటు రూ. 12,328 కోట్ల ఖర్చుతో నాలుగు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కచ్‌లోని దూర ప్రాంతాల కలయిక, పర్యాటకానికి ఊపిరినిచ్చేలా ఈ కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నారు. రణ్ ఆఫ్ కచ్, హరప్పా స్థలం ధోలవిరా, కోటేశ్వర్ ఆలయం, నారాయణ సరోవర్, లాఖ్‌పట్ కోటకు రైలు సదుపాయం కల్పించ సంకల్పించారు. దీని ద్వారా ఈ ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో 251 లక్షల మానవ పని దినాల ఉపాధి కలుగుతుంది. ఈ ప్రాజెక్టుల వల్ల బొగ్గు, సిమెంట్, స్టీల్, కంటైనర్లు, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు పెద్ద మేలు జరుగుతుంది. లాజిస్టిక్ ఖర్చులు తగ్గుతాయి. పర్యావరణ హితం, సివో 2 ఉద్గారాల నియంత్రణ కలుగుతుంది. కర్నాటక, తెలంగాణ, బీహార్, అస్సాం రాష్ట్రాలకు మల్టీ–ట్రాకింగ్‌తో కనెక్టివిటీ పెంపు జరుగుతుంది. ఈ ప్రాజెక్టు వల్ల 13 జిల్లాలు లబ్ధి పొందుతాయి. 565 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాల కలయిక జరుగుతుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా 360 కోట్ల కిలోల సివో2 తగ్గింపు జరుగుతుంది. ఇది 14 కోట్ల చెట్ల నాటిన దానికి సమానమైన ప్రయోజనం ఇస్తుంది.

కామన్వెల్త్ క్రీడలు–2030 (సీడబ్ల్యూజీ) వేలంలో పాల్గొనేందుకు బిడ్ సమర్పించాలన్న యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. బిడ్ ఆమోదం పొందినట్లయితే.. సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు, అధికారుల నుంచి అవసరమైన హామీలతో పాటు ఆతిథ్య సహకార ఒప్పందంపై (హెచ్‌సీఏ–హోస్ట్ కొలాబరేషన్) సంతకం చేయడానికి.. గుజరాత్ ప్రభుత్వానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని (గ్రాంట్–ఇన్–ఎయిడ్) మంజూరు చేసేందుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 72 దేశాలకు చెందిన క్రీడాకారులు కామన్వెల్త్ క్రీడలలో పాల్గొంటారు. క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడలను నియంత్రించే అధికారులు, పర్యాటకులు, క్రీడలకు సంబంధించిన మీడియా వ్యక్తులు వంటి వారు ఈ భారీ క్రీడా కార్యక్రమానికి హాజరవుతారు. ఇది స్థానిక వ్యాపారాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. వారి ఆదాయాలను పెంచుతుంది.

# ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

బలగం టీవీ, హైదరాబాద్

మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో అటవీ ప్రాంతం తుపాకుల శబ్దాలతో దద్దరిల్లింది. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టు లు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం విశ్వసనీయ వర్గాల ద్వారా పోలీసులకు అందింది. దీంతో మహారాష్ట్ర పోలీసులు, సీఆర్పీఎఫ్‌కు చెందిన రెండు క్విక్ యాక్షన్ టీమ్‌లు (క్యూఏటీలు) గడ్చిరోలి–నారాయణ్‌పూర్ సరిహద్దుల్లో గల కోపార్శి అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్‌ను చేపట్టాయి. అదనపు ఎస్పీ ఎం.రమేశ్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగింది. భారీ వర్షంలోనూ జరిగిన ఈ ఆపరేషన్‌లో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. దాదాపు ఎనిమిది గంటల పాటు సాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలం వద్ద పోలీసులు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. దేశంలో మావోయిస్టుల అంతమే లక్ష్యంగా కేంద్రం తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్‌లో భాగంగానే ఈ కాల్పులు జరిగినట్టు అధికారులు ధ్రువీకరించారు.

# ఏ పోటీలు నిర్వహించినా తెలంగాణకు అవకాశం కల్పించాలి

- తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం
- హైదరాబాద్ లో జరిగిన స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ పాలక మండలి తొలి సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్



ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగు పర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని బోర్డు తీర్మానాలను ఆమోదించింది. హైదరాబాద్ లో జరిగిన స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ పాలక మండలి తొలి సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ఆకాంక్షించారు.

తెలంగాణకు ఐటీ సంస్కృతి ఉందని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని, ఆ తరహాలోనే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు ముఖ్యమంత్రి గారు తెలిపారు. క్రీడా రంగం ప్రోత్సాహానికిగానూ గతంతో పోల్చితే 16 రెట్లు బడ్జెట్ పెంచామని చెప్పారు.జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవు.వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించాం.. అని ముఖ్యమంత్రి గారు వివరించారు.ఈ సమావేశంలో స్పోర్ట్ హబ్ చైర్మన్, ఆర్ పీ సంజీవ్ గోయెంకా గ్రూప్ చైర్మన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా , హబ్ కో–చైర్ పర్సన్ ఉపాసన కొణిదెల , సభ్యులు, ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ , ప్రముఖ షఉటర్ అభినవ్ బింద్రా , ధాని ఫౌండేషన్ వీతా ధాని , బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, విశ్వ సముద్ర ఫౌండేషన్ చింతా శశిధర్, క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు, ఫుట్ బాల్ టీమ్ మాజీ కెప్టెన్ భైచుంగ్ భూటియా, ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు రవికాంత్ రెడ్డి , ఏఐపీఎస్ %–% ఏసియా వైస్ ప్రెసిడెంట్ సబా నాయకన్ క్రీడాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పందిస్తూ, ఇప్పటి వరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసన సభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు. క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని, రాష్ట్ర స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని చెప్పారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు. రానున్న మూడేళ్లలో మనం సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు.సమావేశంలో క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ గారు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి గారు, ఎండీ సోని బాల దేవి గారు పాల్గొన్నారు.

# మునిగిన ఉమ్మడి నిజామాబాద్



(మొదటి పేజీ తరువాయి)

అతి భారీ వర్షాలు కురవడంతో అస్తవ్యస్థంగా మారింది. బుధ, గురు వారాల్లో కుండపోత వర్షం పడటంతో మెదక్, సిద్దిపేట జిల్లాలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కాయి. వరదలు ఉధృతంగా ప్రవహించడంతో రహదారులు, రోడ్లు కొట్టుకుపోయాయి. వరద నీరంతా లోతట్టు ప్రాంతాల్లో చేరడంతో పలు గ్రామాలు, పట్టణాలు జలమయమయ్యాయి. ఇండ్లు కూలిపోయాయి.

హవేళీఘన్‌పూర్ మండలంలో వరదల్లో చిక్కి ఇద్దరు యువకులు మృతిచెందారు. పలు చోట్ల కార్లు, ఆటోలు, వాహనాలు కొట్టుకుపోయి ప్రమాదాలు సంభవించాయి. వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. గండ్లు పడ్డ చోట పొలాల్లో ఇసుక మేటలేశాయి. పశువులు, కోళ్లు, మేకలు మృత్యువాత పడ్డాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నది. రోడ్లు, రహదారులు ధ్వంసమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరద ప్రభావిత ప్రాంతమైన హవేళీఘన్‌పూర్ ఏరియాలో ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. మంత్రులు వివేక్, దామోదర్, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, రోహిత్‌రావు, కలెక్టర్లు, ఎస్పీలు ప్రమాద ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజలను ఆదుకుంటామని భరోసా కల్పించారు. సీపీఐ(ఎం) నేతలు వరదల్లో చిక్కిన కాలనీలు, ప్రజల్ని కలిశారు. సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

### గ్రామాలు, పట్టణాలు జలమయం

హవేళీఘన్‌పూర్ మండలంలో దూప్‌సింగ్ తండా పూర్తిగా నీటిలో మునిగింది. మెదక్ పట్టణంలో అనేక కాలనీల్లో నీరు చేరింది. రామాయంపేటలో ఆకుల బస్తీ, వెంకటేశ్వర, బీసీ, హమాలీ కాలనీల్లోకి నీరు చేరింది. మహిళా డిగ్రీ కళాశాల వరద నీటిలో చిక్కడంతో 300 మంది విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దొంగల ధర్మారం చెర్వు అలుగుపోయడంతో రోడ్డు దెబ్బతిని రాకపోకలాగాయి. జహీరాబాద్ పట్టంలోని అనేక కాలనీలు నీటి కుంటల్ని తలపిస్తున్నాయి.

### ఇద్దరు మృతి

హవేళీఘన్‌పూర్ మండలంలోని రాజపేట్‌కు చెందిన బెస్త సత్యనారాయణ(35), దామరంచ యాదాగౌడ్ ఇద్దరు బుధవారం మెదక్‌లోని హాస్టల్‌లో పిల్లలను తీసుకొచ్చేందుకు ఆటోలో వెళ్లారు. రాజపేట్ గంగమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న విషయం గమనించకుండా వరదలో వెళ్లడంతో ఇద్దరు యువకులు కొట్టుకుపోయారు. మధ్యలో ఓ కరెంట్ స్థంభాన్ని ఎక్కి నాలుగు గంటల పాటు ప్రాణాల్ని రక్షించుకోగలిగారు. అయితే వరద పెరగడంతో ఆ స్థంభం కూడా కూలిపోవడంతో యువకులు కొట్టుకుపోయారు. అందులో సత్యనారాయణ శవం లభించగా.. యాదాగౌడ్ ఆచూకీ దొరకలేదు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో 500 ఇండ్ల వరకు కూలడం, దెబ్బతినడం వల్ల అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. మెదక్ జిల్లాలో రెండు పునరావాస కేంద్రాల్లో దూప్‌సింగ్ తండా ప్రజలు తలదాచుకుంటున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. నిర్మల్ జిల్లాలోని కుంటాల మండల పరిధిలోని కల్లూర్–కుంటాల రహదారి మార్గం ప్రమాదకరంగా మారింది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో రహదారి మార్గంలోని అందకూర్ అలుగు ఉధృతంగా ప్రవహించడం మూలంగా అక్కడి ప్రాంతంలోని రోడ్డు భారీ పరిమాణంతో కోతకు గురైంది. రోడ్డుకు ఒక వైపు అధిక భాగం కోతకు గురికావడం మూలంగా రాకపోకలకు నిలిచిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. మరో వైపు వంతెనపై భారీ బుంగ ఏర్పడింది. దీంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు మినహా ఇతర వాహనాల రాకపోకలు చేపట్టే పరిస్థితులు లేకుండా పోయాయి. వర్షం పరిస్థితి ఇలాగే కొనసాగితే కల్లూర్–కుంటాల రోడ్డు మార్గంలో పూర్తి స్థాయిలో రవాణాకు ఆటంకం కలిగే పరిస్థితులున్నాయి. అంతే కాకుండా ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచే పరిస్థితులు నెలకొని ఉన్నాయి భారీ వర్షం కురవడంతో వెంకూర్ లోవెల్ వంతెన సైతం ఉధృతంగా ప్రవహిస్తుంది అదేవిధంగా పంటలు నీట మునిగిపోయాయి సోయా పత్తి పంటలు నీట మునిగిపోవడంతో నెలకొరిగి పోయాయి భారీ వర్షానికి పంటలు దెబ్బతినడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు.

# ఎగువ మానేరు ఉగ్ర రూపం ...





(మొదటి పేజీ తరువాయి)

**సురక్షితంగా ఒడ్డుకు చేరిన ప్రవీణ్...**

గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో పశువులను తీసుకురావడానికి వెళ్లి మానేరు వాగులో ప్రవీణ్ చిక్కుకున్నడు. విషయం తెలుసుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఎస్పి మహేష్ బి.గితే దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షించినారు. సాయి క చర్యలు ప్రారంభించిన ఎన్‌డీఆర్ ఎఫ్ బృందం సుమారు నాలుగు ఐదు గంటలు శ్రమించి వరదలో చిక్కుకున్న ప్రవీణ్ను రక్షితపుగా ఒడ్డుకు చేర్చారు.

**వరద నీటిలో చిక్కుకున్న వారు క్షేమం..**

రెండు హెలికాప్టర్ల ద్వారా ఐదుగురిని సురక్షిత ప్రాంతానికి తరలించిన ఆర్మీ అధికారులునర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్టు అవతలి వైపు పశువులను మేపేందుకు వెళ్లి ఐదుగురు, అక్కడే చిక్కుకుపోగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. చిక్కుకున్న వారికి ఆహార సదుపాయం కల్పించారు. హకీంపేటలోనే సైనిక హెలికాప్టర్లు గురువారం చేరుకొని ఐదుగురిని క్షేమంగా గమ్యం చేర్చారు. ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా అధికార యంత్రాంగం దగ్గరుండి పర్యవేక్షించారు.

## సిరిసిల్లలో వరద ప్రాంతాలను పరిశీలించిన కేటీఆర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్లలోని నర్మాల వరద ప్రాంతాల పర్యటనను ముగించుకుని కామారెడ్డి వెళ్లే మార్గంలో వరద ఉధృతి వలన ప్రయాణానికి ఆటంకాలు ఏర్పడటంతో మాచారెడ్డిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పరిశీలన జరిపారు. నర్మాలలో పర్యటన తర్వాత, కేటీఆర్ కామారెడ్డికి బయలుదేరారు. మాచారెడ్డి మండలం వద్దకు చేరుకున్నప్పుడు, పాల్వంచ వాగు ఉధృతికి రోడ్డు తెగిపోయిందని గమనించారు. దీంతో కామారెడ్డి వైపు వెళ్లేందుకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనితో కేటీఆర్ తన పర్యటనను రద్దు చేసుకుని తిరిగి సిరిసిల్లకి వచ్చారు.పర్యటన సందర్భంగా కేటీఆర్ వరద ఉధృతి వల్ల ప్రజలకు కలిగిన ఇబ్బందుల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, వాగు ప్రవాహం మరియు తెగిన రోడ్డు పరిస్థితిని కూడా ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ వరదలు సాధారణ ప్రజల జీవితాలను ఏ విధంగా ప్రభావితం చేశాయో కూడా అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, సాధారణ ప్రజల జీవితాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. పాల్వంచ వాగు వరదల వల్ల జనజీవనానికి ఏర్పడిన ఆటంకాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## నర్మాల వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని కాపాడిన రెండు ఆర్మీ చాపర్లు

(మొదటి పేజీ తరువాయి)

బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ "భారీ వర్షాలు, వరదలతో ప్రజలు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, నర్మాల వరదల్లో బాదితులు చిక్కుకుపోయారని తెలిసిన వెంటనే కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కోరిన వెంటనే ఆర్మీ హెలికాప్టర్లను పంపారని, అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో బుధవారం రాలేకపోయాయని అన్నారు. గురువారం వర్షం కొద్దిసేపు తెరిపి ఇచ్చిన వెంటనే హెలికాప్టర్లు వచ్చి బాధితులను ఎయిర్ లిఫ్ట్ చేశాయని అన్నారు.ఈ సందర్భంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హెూంమంత్రి అమిత్ షా లకు ధన్యవాదాలు తెలిపారు.బాధితుల ప్రాణాలను కాపాడేందుకు బుధవారం నుండి కష్టపడి పనిచేస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేకించి ఆర్మీ చాపర్లను తెచ్చి బాధితుల ప్రాణాలు కాపాడిన రక్షణ శాఖ అధికారులకు అభినందనలని,ముఖ్యంగా ఎయిర్ కమాండర్ వీఎస్.శైని చేసిన క్రుషి అంతా ఇంతా కాదని ,వారికి హ్యాట్సాఫ్ చెప్పారు. ప్రస్తుతమున్న రెండు హెలికాప్టర్లతోపాటు అదనంగా మరో రెండు హెలికాప్టర్లు సిరిసిల్లకు వచ్చాయని, వరద బాధిత ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు.ఈ టైంలో దయచేసి రాజకీయాలు వద్దని,ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం సరికాదని,బాధితులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పూర్తిగా సమన్వయంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులతో నిరంతరం మాట్లాడుతూ పరిస్థితిని అంచనా వేస్తున్నామ అని అన్నారు.





**కలెక్టర్, ఎస్పీలకు హ్యాట్సాఫ్ చెప్పిన కేంద్ర మంత్రి**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ఎస్పీలను ప్రత్యేకంగా అభినందించారు. నర్మాలకు వచ్చిన కేంద్ర మంత్రిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి.గితే తో కలిసి పరిస్థితిని వివరిస్తూ తీసుకుంటున్న సహాయ చర్యలను వివరించారు. కలెక్టర్, ఎస్పీ బుధవారం నుండి కష్టపడి పనిచేస్తూనే ఉన్నారని ,వీళ్లు లేకుంటే భయంతో బాధితులు ఏమైపోయేవారో. వాళ్లకు ఎప్పటికప్పుడు భరోసా ఇస్తూ వారికి అవసరమైన సాయం చేస్తూ ప్రాణాలు కాపాడిన వీరిద్దరికీ హ్యాట్సాఫ్"అని అభినందించారు.

**నిరంతరం నర్మాల బాధితులను కాపాడేందుకు సంజయ్ యత్నం**

గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువనుండి ఊహించని విధంగా వరద నీరు రావడంతో నర్మాల వరదల్లో పిట్ల నర్సింహులు, ధ్యానబోయిన స్వామి, పిట్ల మహేశ్, పిట్ల స్వామి, జంగం స్వామి చిక్కుకుపోయారని సమాచారం వచ్చిన వెంటనే సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు ఫోన్ చేసి పరిస్థితిని వాకబు చేశారు. వరదల్లో చిక్కుకున్నందున వారిని కాపాడే పరిస్థితి లేదని, ఆర్మీ హెలికాప్టర్ సాయం కావాలని, అట్లాగే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగం లోకి దించాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ వెంటనే కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు ఫోన్ చేసి ఆర్మీ హెలికాప్టర్లను పంపించాలని కోరారు. బండి విజప్తికి అంగీకరించిన రాజ్ నాథ్ సింగ్ తక్షణమే ఆర్మీ హెలికాప్టర్లను పంపించాలని రక్షణ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ఎయిర్ కమాండర్ వీఎస్.శైనీ, గ్రూప్ కెప్టెన్ హెచ్ సీ ఛటోపాధ్యాయ హకీంపేట నుండి బుధవారం సాయంత్రమే హెలికాప్టర్లను పంపారు. అయితే కొద్దిదూరం వెళ్లిన 2 హెలికాప్టర్లు వాతావరణం అనుకూలించకపోవడంతో వెనుదిరిగాయి. అయితే బాధితులు అధైర్యపడొద్దని, వాతావరణం అనుకూలించిన వెంటనే హెలికాప్టర్లు నర్మాలకు వస్తాయని, ఎయిర్ లిఫ్ట్ చేస్తాయని భరోసా ఇచ్చారు.

## భారీ వర్షాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు

**● రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రంగాన్ని అప్రమత్తం చేయాడం జరిగిందని,ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎవరు కూడా బయటికి రాకూడదని ఎస్పీ తెలిపారు. పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని,ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే,స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని,అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండలని,నర్మల ఎగువ మానేరు మత్తడి దుంకుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని ఎగువ మానేరు డ్యామ్ ను చూడడానికి ఎవరిని అనుమతించడం లేదని అన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,కాలువలు,నదులు, రిజర్వాయర్లు,చెరువుల వద్దకు వెళ్లకుండా తగు భద్రత చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.. జలాశయాలు, చెరువులు,వాగుల ,ప్రాజెక్టు ల వద్దకు మత్స్యకారులు,ప్రజలు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లకూడదు.

రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి,వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని,వైర్లను గానీ చేతులతో తాకవద్దు. చెట్ల కింద,పాడైన భవనాలు కింద,శిధిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదు.విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ ముట్టుకోరాదు. స్థానిక రెవెన్యూ,ఇరిగేషన్,పంచాయతీ, విద్యుత్, ఆర్ అండ్ బి, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్ల పై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా,ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు,రోడ్లపై వస్తున్న వరద నీటి వద్దకు ఎవరు వెళ్లకుండా జిల్లా వ్యాప్తంగా రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్,బారిగేడ్స్,హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి పోలీస్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని , ప్రత్యేక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు కట్టలు తెగి పోయే ప్రమాదం ఉంటుంది. కావున ప్రజలు అప్రమత్తం గా ఉండగలరు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించండి. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. కావున జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించండి. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదు అని సూచించారు.

## లోయర్ మానేరు డ్యామ్‌కు వరద ముప్పు

**బలగం టీవీ, కరీంనగర్**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో లోయర్ మానేరు జలాశయానికి భారీ వరద నీరు చేరుతోంది. పైప్రాంతాల నుండి మోయ తుమ్మెద వాగుతో పాటు శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) రిజర్వాయర్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు ఎల్ఎండీకి చేరడంతో గంట గంటకూ నీటిమట్టం పెరుగుతోంది. ఎల్ఎండీ గరిష్ఠ సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉంది. నిన్న మొన్నటివరకు 10 టీఎంసీల లోపే ఉన్న నీరు ఒక్కరోజులోనే వేగంగా పెరిగి ఈ స్థాయికి చేరింది. ప్రస్తుతం మోయ తుమ్మెద వాగు నుండి 27 వేల క్యూసెక్కులు, మిడ్ మానేరు నుండి 45 వేల క్యూసెక్కుల వరద నీరు ఎల్ఎండీకి వస్తోంది. ఈ వరద కొనసాగితే శుక్రవారం సాయంత్రానికి ఎల్ఎండీ రిజర్వాయర్ గేట్లు ఎత్తి మానేరు వాగులోకి నీటిని విడుదల చేసే అవకాశముందని అధికారులు తెలిపారు. ఇప్పటికే పరివాహక ప్రాంతాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.



## బాగున్నారా .

**● నర్మాలలో ఎదురపడ్డ బండి .. కేటీఆర్**

**బలగం టివి,రాజన్న సిరిసిల్ల**

రాష్ట్ర రాజకీయాల్లో ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలు చేసుకొని కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకరికి ఒకరు ఎదురుపడ్డారు. ఎప్పుడు విమర్శలు చేసుకునే నేతలు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎగువ మానేరు ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. ఎగువ మానేరు వద్ద చిక్కకపోయినా రైతులను హెలికాప్టర్ సహాయంతో ఆర్మీ అధికారులు గురువారం రిస్కు చేసి గమ్యం చేర్చారు. మరోవైపు నర్మాల బాధితులను పరామర్శించి కేంద్ర మంత్రి బండి సంజయ్ వెళుతుండగా ,మాజీ మంత్రి కేటీఆర్ ఎదురుపడ్డారు. బండి సంజయ్ ను చూడగానే కాన్వాయ్ వద్దకు కేటీఆర్ రాగనే, వాహనం దిగి కేటీఆర్ వద్దకు వచ్చిన బండి సంజయ్ అభివాదం చేశారు. బాగున్నారా,అంటూ ఒకరికొకరు పలకరించుకున్నారు. కష్టపడుతున్నావంటూ కేటీఆర్ ఈ సందర్భంగా బండి సంజయ్ ను ఉద్దేశించి చెబుతూ నర్మాల బాధితులను పరామర్శించేదుకు కేటీఆర్ వెళ్లిపోయారు.


## కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం

బలగం టీవీ, హైదరాబాద్

భారత్‌లోకి చొరబడటానికి ప్రయత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను జమ్ము కశ్మీర్‌లో భద్రతా దళాలు కాల్చి చంపాయి. బండిపొరా జిల్లా, గురెజ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వద్ద ఈ ఘటన చోటుచేసుకుందని గురువారం అధికారులు ఎక్స్‌లో తెలిపారు.

## ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన రవిచంద్రన్ అశ్విన్

బలగం టీవీ, చెన్నై




ఐపీఎల్‌లో తన ముద్ర వేసిన స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. బుధవారం (ఆగస్టు 27, 2025) ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇటీవల చెన్నై సూపర్‌కింగ్స్‌లో మళ్లీ చేరిన అశ్విన్, ఇంకా కొన్ని సీజన్లు ఆడతాడని అభిమానులు ఆశించారు. అయితే ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ – "నా ఐపీఎల్ జర్నీ ఇక్కడ ముగిసింది. కానీ కొత్త లీగ్‌లలో కొత్త అనుభవాలకు ఇది నాంది" అని పేర్కొన్నాడు.ఐపీఎల్ 2025 మెగా వేలంలో సీఎస్‌కే, అశ్విన్‌ను భారీగా రూ. 9.75 కోట్లు వెచ్చించి దక్కించుకుంది. ఇది ధోని జీతం (రూ. 4 కోట్లు) కంటే దాదాపు రూ. 5.75 కోట్లు ఎక్కువ కావడం విశేషం. లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్‌లతో పోటీ పడి సీఎస్‌కే అశ్విన్‌ను తిరిగి తీసుకుంది.

2008లో సీఎస్‌కేలో చేరిన అశ్విన్, 2009లో డెబ్యూ చేశాడు. 2010, 2011లో సీఎస్‌కే ఛాంపియన్‌గా నిలిచిన జట్టులో కీలక పాత్ర పోషించాడు. ఆ ప్రదర్శనతోనే టీమిండియాలో చోటు సంపాదించాడు. 2018లో పంజాబ్ కింగ్స్‌కి మారి అక్కడ రెండు సీజన్లు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్‌లకు ఆడిన తర్వాత మళ్లీ 2025లో సీఎస్‌కేలో చేరాడు. ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన అశ్విన్ ఇకపై విదేశీ టీ20 లీగ్‌లలో ఆడబోతున్నాడు. అనుభవం, స్పిన్ బౌలింగ్ నైపుణ్యంతో అంతర్జాతీయ లీగ్‌లలో ఎలా రాణిస్తాడో చూడాలి మరి.


## హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుకు బెయిల్

బలగం టీవీ, హైదరాబాద్



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుకు భారీ ఊరట లభించింది. అవినీతి, నిధుల దుర్వినియోగం, మోసం ఆరోపణలపై అరెస్టయిన ఆయనకు హైదరాబాద్ హైకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు రెండు షూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. జగన్‌మోహన్‌రావుతో పాటు హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, సభ్యులు సునీల్, రాజేందర్ యాదవ్, కవితలను సీఐడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిధుల అక్రమాలు, అధికార దుర్వినియోగంపై విచారణ జరిపిన అధికారులు ప్రభుత్వం వద్ద నివేదిక సమర్పించడంతో కేసులు నమోదయ్యాయి.

ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో హెచ్‌సీఏ మధ్య కాంప్లిమెంటరీ టికెట్లపై వివాదం నెలకొంది. అదనపు టికెట్లు ఇవ్వాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు బెదిరింపులకు పాల్పడ్డాడని సన్‌రైజర్స్ ఫ్రాంచైజ్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ విచారణకు ఆదేశించగా, నివేదికలో పలు అక్రమాలు బయటపడ్డాయి. దాంతో సీఐడీ చర్యలకు దిగింది. అవినీతి ఆరోపణలతో అరెస్టవ్వడంతో జూలై 28న హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జగన్‌మోహన్‌రావుతో పాటు కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్‌లను సస్పెండ్ చేసింది.




## రామ్‌చరణ్ 'పెద్ది' పాట చిత్రీకరణ

బలగం టీవీ, హైదరాబాద్

'పెద్ది' పాత్రలో కనిపించబోతున్న రామ్‌చరణ్ తనకు తానే శిల్పిగా మారారు. ఆ పాత్రకు కావాల్సిన దేహ దారుఢ్యం కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ రోజంతా కష్టపడుతున్నారు. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. తాజా షెడ్యూల్‌లో భాగంగా మైసూర్‌లో రామ్‌చరణ్‌పై గ్రాండ్ సాంగ్ చిత్రీకరణ ప్రారంభమైంది. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్న ఈ పాటకు ఏ.ఆర్. రెహమాన్ స్వరపరిచారు. వెయ్యిమందికి పైగా డాన్సర్లతో కలిసి చిత్రీకరిస్తున్న ఈ పాట విజువల్ ఫీస్ట్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. రామ్‌చరణ్ తన ట్రేడ్‌మార్క్ ఎనర్జీ, గ్రేస్‌తో వేసిన మాస్ స్టెప్పులు ప్రత్యేక హైలైట్‌గా నిలవనున్నాయి. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ అగ్ర నటుడు శివరాజ్‌కుమార్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఆర్. రత్నవేలు.

# వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ క్వార్టర్స్‌లో తెలుగు తేజం

- సింధు ఘన విజయం

బలగం టీవీ, హైదరాబాద్



బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ వేదికగా భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అదరగొడుతోంది. తొలి రెండు రౌండ్లలో కఠిన పోరాటం తర్వాత గెలుపొందిన సింధు, గురువారం జరిగిన 16వ రౌండ్‌లో చైనాకు చెందిన రెండో సీడ్ వాంగ్ జీ యీని సులువుగా మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్లో స్థానం సంపాదించింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన సింధు ఈ టోర్నీలో ధాటిగా ఆడుతోంది. తొలి రౌండ్‌లో బల్గేరియాకు చెందిన కలోయనా నల్బంతోవాను ఓడించగా, రెండో రౌండ్‌లో మలేషియా షట్లర్ కరుపథెవన్ను ఇంటి దారి చూపించింది. కీలకమైన ప్రీ-క్వార్టర్స్‌లోనూ చెలరేగిన సింధు రెండో సీడ్ వాంగ్ జీపై విజయం సాధించి అభిమానులను ఉత్రూతలూగించింది. క్వార్టర్ ఫైనల్లో సింధుకు మరో పటిష్ట సవాల్ ఎదురుకానుంది. వరుస విజయాలతో స్ఫూర్తి పొందిన తెలుగు తేజం తన జోరును కొనసాగించేందుకు సిద్ధమవుతోంది.

# 'అఖండ 2' విడుదల వాయిదా

బలగం టీవీ, హైదరాబాద్



నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'అఖండ 2' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు నిర్మాతలు విడుదల చేసిన ప్రకటనలో, సినిమా నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా రీ-రికార్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్ కోసం మరింత సమయం అవసరమని పేర్కొన్నారు. ప్రేక్షకులకు అత్యుత్తమ థియేటర్ అనుభూతిని అందించాలనే ఉద్దేశ్యంతోనే ఈ ఆలస్యం జరుగుతోందని వివరించారు. ముందుగా సెప్టెంబర్ 25న విడుదల చేయాలని నిర్ణయించినా, పనుల్లో జాప్యం కారణంగా ఆ తేదీ సాధ్యం కాలేదని తెలిపారు. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో అన్ని భాషల్లో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయని, ఆ అంచనాలను అందుకునేలా చిత్రాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. "అఖండ 2 తాండవం ఒక సినిమా కాదు, అదొక సినిమా పండుగ" అంటూ ప్రకటన ముగించడం ద్వారా, సినిమాపై ఆసక్తిని మరింత రెట్టింపు చేశారు. బాలయ్య–బోయపాటి కాంబోలో వచ్చిన 'అఖండ' భారీ విజయం సాధించడంతో, సీక్వెల్‌పై దేశవ్యాప్తంగా సినీప్రియుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

## 'గప్ చుప్ గణేశా' ట్రైలర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్




మొహమాటం తీసుకొచ్చే ఇబ్బందులనే ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కుతున్న కామెడీ ఎంటర్టైనర్ 'గప్ చుప్ గణేశా' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. రోషన్, రిదా జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సూరి.ఎస్ దర్శకత్వం వహించగా, కె.ఎస్. హేమరాజ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. నిర్మాత కె.ఎల్.దామోదరప్రసాద్ ట్రైలర్‌ను లాంచ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రైలర్ మొత్తం వినోదాత్మకంగా సాగి, అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చే చిత్రమిదే అని దర్శకుడు, నిర్మాత నమ్మకం వ్యక్తం చేశారు. హీరో, హీరోయిన్‌లు కూడా ఈ చిత్రంలో భాగం కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అంబటి శ్రీనివాస్, గడ్డం నవీన్, అశోక్ వర్ధన్, సోనాలి పాణిగ్రహి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: అంగత్ కుమార్, సంగీతం: శ్రీతరుణ్.



## ఎస్వీ కృష్ణారెడ్డి 'వేదవ్యాస్' ప్రారంభం

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్‌లో ఎన్నో సూపర్‌హిట్ సినిమాలతో పేరుగాంచిన ఎస్వీ కృష్ణారెడ్డి మరో కొత్త చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టబోతున్నారు. ఆయన 43వ సినిమా 'వేదవ్యాస్' అధికారికంగా ప్రారంభమైంది. ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఘనంగా నిర్వహించబడింది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు, డైరెక్టర్లు వీవీ వినాయక్, అనిల్ రావిపూడి చేతుల మీదుగా ముహూర్తం నిర్వహించబడింది. కె. అచ్చిరెడ్డి సమర్పణలో సాయిప్రగతి ఫిలింస్ బ్యానర్‌పై, ప్రముఖ వ్యాపారవేత్త కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సౌత్ కొరియన్ నటి జున్ హ్యున్ జీ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ప్రారంభోత్సవంలో దిల్ రాజు ఆమెకు స్వాగతం పలికారు. ముహూర్తపు షాట్ దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చి, అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. ప్రముఖ నిర్మాత జెమినీ కిరణ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ నటులు మురళీ మోహన్, అలీ, జుబేదా అలీ, సాయికుమార్, కెమెరామెన్ శరత్, ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం మొత్తం వినూత్నంగా, ఘనంగా సాగింది.




## 'ఓజీ' కొత్త పాట విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

వినాయకచవితి సందర్భంగా పవన్‌కల్యాణ్ ప్రధాన పాత్రలో వచ్చే 'ఓజీ' సినిమా నుంచి విడుదలైన రెండో గీతం ప్రేక్షకులను మెలోడీ రొమాంటిక్ అనుభూతిలో ముంచేస్తోంది. 'సువ్వీ .. సువ్వీ..' అంటూ మొదలయ్యే ఈ పాటలో నాయకానాయికల ప్రేమబంధాన్ని, లోతైన ఆత్మీయతను ప్రతిబింబించేలా కల్యాణచక్రవర్తి త్రిపుర రచన వహించారు. సంగీతం తమన్, గాత్రం శృతి రంజని. పవన్‌కల్యాణ్, ప్రియాంక అరుళ్ మోహన్‌లపై దర్శకత్వం వహించిన సుజిత్ ఈ పాటను రంగుల పటమా వర్ణిస్తాడు. దదసినిమాలో మాఫియా డాన్గా నటిస్తున్న పవన్‌కల్యాణ్, ఇమ్రాన్ హష్మీ, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. కెమెరా: రవి కె.చంద్రన్, మనోజ్ పరమహంస. నిర్మాణం: డీవీవీ ఎంటర్టైన్మెంట్స్, నిర్మాతలు: డీవీవీ